క్లుప్తంగా

బసవేశ్వరుడికి శ్రీశైలం పీఠాధిపతి పూజలు



బసవేశ్వరుడికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

నంద్యాల(వ్యవసాయం): బైర్మల్‌వీధిలోని శ్రీబసవేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం శ్రీశైలం పీఠాధిపతి 1008 చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ వీరశైవ ఆగమ సలహా దారుడు శ్రీ శశిభూషణ్ సిద్ధాంతి ఆధ్వర్యంలో శివుడికి అభిషేకాలు నిర్వహించి, అనంతరం బసవేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేపట్టారు. పట్టణ వీరశైవ సంక్షేమ సంఘం నాయకులు స్వామి వారిని ఘనంగా సత్కరించారు.

అభయాంజనేయస్వామికి..

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో టెక్కె నాగలింగేశ్వరస్వామి ఆలయంలో వెలసిన శ్రీఅభయాంజనేయస్వామికి కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం, సింధూరాభిషేకం చేశారు. స్వామి వారిని వడమాల, తమలపాకులచే అలంకరించి అష్టోత్తర నామాలు పఠించారు. అనంతరం మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో అష్టాదళ పాద పద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం) : పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబా చంద్రోఖర దేవస్థానంలో మంగళవారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ,పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్ర మం చేపట్టారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం కార్యక్రమాన్ని సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీ నారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని పద్మావతినగర్‌లో వెలసిన శ్రీకృష్ణమందిరంలో కార్తీక మాసం అష్టమిని పురస్కరించుకొని గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోమాతకు విశేష పూజలు నిర్వహించి ఒడి బియ్యం, చీర సమర్పించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు విజయచంద్ర, పార్థసారథికృష్ణ పాల్గొన్నారు.

ఆదాయ వనరులను సృష్టించుకోవాలి

దొర్నిపాడు: గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరులను సృష్టించుకోవాలని ఎంపీడీఓ సుబ్బారెడ్డి, తహసీల్దార్ జయప్రసాద్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో పరిపాలన సౌలభ్యం కోసం జీవోలు, సొంత ఆదాయ వనరులపై అవగాహన కల్పించారు. రికార్డుల నిర్వహణ, పన్నులు, గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులకు సంబంధించి బిల్లుల తయారీ విధానాన్ని వివరించారు.

వ్యాధి నిర్ధారణలో జాప్యం వద్దు



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

నంద్యాల టౌన్: వ్యాధి నిర్ధారణలో జాప్యం లేకుండా చూడాలని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకట రమణ అన్నారు. మంగళవారం స్థానిక సర్వజన ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్స్, సబ్ యూనిట్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాథమిక వైద్య కేంద్రాల్లో శాంపిళ్లను పక్కాగా పరీక్షించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండ రిపోర్టులు ఇవ్వాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే వారి వివరాలు నమోదు చేయాలన్నారు. జిల్లా మలేరియా అధికారి కామేశ్వర రావు పాల్గొన్నారు.

కులగణన బాధ్యతగా చేపట్టాలి

ఉయ్యాలవాడ : కులగణనను గ్రామ సచివాలయ ఉద్యోగులు గ్రామ వలంటీర్లతో కలిసి బాధ్యతగా చేపట్టాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి సూచించారు. ఈ నెల 11 నుంచి కుల గణన ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి కోసమే సంక్షేమ పథకాలు



15వ వార్డులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



చిత్రేణిపల్లెలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మార్కెట్‌యార్డు చైర్మన్



శెట్టివీడులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

నంద్యాల(సిటీ): పేదల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతోందని అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు అన్నారు. మంగళవారం 15వ వార్డు గోపాల్‌నగర్, 23వ వార్డు ఏకలవ్య నగర్, 34వ వార్డు వీసీ కాలనీలలో పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించి పేదలకు జరుగుతున్న మేలును తెలియజేశారు.

- 13వ వార్డు గోపాల్‌నగర్‌లో వార్డు ఇన్‌చార్జ్ సన్నల సాయిరాంరెడ్డి ఆధ్వర్యంలో వార్డుకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వార్డు పరిధిలో నాలుగున్నరేళ్లుగా నిర్వహించిన సంక్షేమాభివృద్ధికి సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు.
- 23వ వార్డు ఏకలవ్యనగర్‌లో వార్డు కౌన్సిలర్ రాజ్యలక్ష్మి, వార్డు ఇన్‌చార్జ్ పార్థుడు ఆధ్వర్యంలో వైఏపీ నీడ్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం రూ.25.10 కోట్లు ఖర్చు చేసిందన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- 34వ వార్డులో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ జాకీర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. వార్డులో జరిగిన రూ.24.32కోట్లతో జరిగిన అభివృద్ధి సంక్షేమాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు.

దేశానికే ఆదర్శం సీఎం జగనన్న

నంద్యాల(అర్బన్): వైఎస్సార్‌సీపీ అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, మండలంలోని రాయమాల్పురం గ్రామంలోని లబ్ధిదారులకు రూ.14.75 కోట్లు లబ్ధి చేకూరిందని నంద్యాల మండలాధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. మంగళవారం గ్రామ సచివాలయం-1 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ, ఈఓఆర్డీ మహీధరరెడ్డి, సర్పంచ్ పార్వతమ్మ, మునగాల మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి జగనన్న గెలిపించుకుందాం

రుద్రవరం: రాబోయే ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిగా మరోసారి గెలిపించుకుందామని ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చిత్రేణిపల్లెలో మంగళవారం నోడల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రసాదరెడ్డి, సచివాలయాల కన్వీనర్ నాగేష్, సర్పంచ్ వరలక్ష్మి, ఎంపీటీసీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శెట్టివీడు సచివాలయానికి రూ.17.48 కోట్లు

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు గ్రామ సచివాలయానికి రూ.17.48 కోట్లు డీబీటీ, నాన్ డీబీటీ కింద సంక్షేమం, అభివృద్ధికి మంజూరు అయ్యాయని ఎంపీపీ వీరభద్రుడు తెలిపారు. మంగళవారం శెట్టివీడు గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లెకు పోదాం కార్యక్రమంలో ఎంపీపీ వీరభద్రుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ఎద్దుల రజేశ్వరీ, సర్పంచ్ లక్ష్మీదేవిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, తోడేండ్లపల్లె గ్రామ సర్పంచ్ గోవిందయ్య, నాయకులు ఎద్దుల లక్ష్మీరెడ్డి, మహబూబ్‌బాషా, పెనుగోండ రాధిక, చిన్న ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

జోడెద్దుల్లా అభివృద్ధి, సంక్షేమం



చెన్నూరులో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- చెన్నూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం

శిరివెళ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల్లా చేసుకొని పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మంగళవారం చెన్నూరు సచివాలయ పరిధిలోని ఇసుకపల్లె, చెన్నూరు గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని నాలుగున్నర ఏళ్లలో అందిన ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. తనను, జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు

రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని ప్రతి పక్షాలు విమర్శస్తున్నాయని, అయితే ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, సిమెంట్ రోడ్లు, గ్రామాలకు రోడ్లు వేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ఇది అభివృద్ధి కాదా? అని టీడీపీని ప్రశ్నించారు. మన బడి నాడు- నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు, వైద్య శాలల రూపు రేఖలు మారాయన్నారు. అలాగే నవ రత్న పథకాలతో ప్రతి కుటుంబానికి రూ. లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిందన్నారు. పేదలు ఆర్థికంగా ముందంజ వేశారని సూచించారు. పాదయాత్రలో జగనన్న ఇచ్చిన హామీలు 99 శాతం నెరవేర్చనన్నారన్నారు. హామీల అమలులో దేశంలోనే జగనన్న ఆదర్శంగా నిలిస్తున్నారని తెలిపారు.

రూ.90 లక్షలతో చెన్నూరు- ఇసుకపల్లె రోడ్డు

10 ఏళ్ల నుంచి అధ్వానంగా ఉన్న చెన్నూరు- ఇసుకపల్లె గ్రామీణ రోడ్డును రూ.90 లక్షలతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే తెలిపారు. రూ. 40 లక్షలతో గ్రామ సచివాలయ భవన నిర్మాణం పూర్తయ్యిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయక్, ఎంపీపీ నాయక్ వసీం, సర్పంచు చిట్టిబాబు, మాజీ సర్పంచు మేర్వ నాగభూషణం రెడ్డి, నాయకులు కుల్లాయ్‌రెడ్డి, వెంకటరెడ్డి, రాం భూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీమండల అధ్యక్షులు బీ.అబ్దుల్ సలాం, ఇందూరి ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డప్పు కళాకారుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(అర్బన్): డప్పు కళాకారుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. తప్పెట వృత్తిని కాపాడే బాధ్యత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకుందని, కళాకారులకు ఇప్పటికే రూ.3వేల పింఛన్ అందజేస్తోందన్నారు. మంగళవారం స్థానిక ప్రథమ నందీశ్వర దేవస్థానం వైఎస్సార్ కల్యాణ మండపంలో ఆది అరుంధిత తప్పెట కళాకారుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. తప్పెట కళాకారుల సంఘం భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించిన నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిని కళాకారులు పూలమాలలతో సత్కరించారు. అనంతరం తప్పెట కళాకారుల సంఘం నాయకులు బాయికాటి ప్రహ్లాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తప్పెట కళాకారులకు శిల్పా కుటుంబంతో విడదీయలేని అనుబంధం ఉందన్నారు. తప్పెట కళాకారులు ఏకతాటి పైకి రావడం సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీపీఎస్‌ఈ మాజీ చైర్మన్ డాక్టర్ నౌమాన్, డాక్టర్ శశికళరెడ్డి, తప్పెట కళాకారులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: ఈవీఎంల పనితీరు ప్రదర్శనపై సంపూర్ణ శిక్షణ పొంది అన్ని నియోజకవర్గాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈవీఎంల పనితీరుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం)లలో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాడ్ తదితర పరికరాల వినియోగం, ఓటు వేసే విధానం తదితర అంశాల్లో సంపూర్ణ శిక్షణ పొందాలన్నారు. శిక్షణ పొందిన అంశాలను ఈఆర్ఓ, ఏఈఆర్ఓల ఆధ్వర్యంలో ప్రతి మండలంలోని పోలింగ్ కేంద్ర పరిధిలోని ప్రజల్లో సంపూర్ణ అవగాహన తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఓ పుల్లయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కామేశ్వరరావు, స్వీప్ నోడల్ అధికారి పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలో ప్రతిభ



క్రీడాకారులతో మాస్టర్ అబ్దుల్‌మజీద్

నంద్యాల(న్యూటౌన్): జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో నంద్యాల క్రీడాకారులు ప్రతిభ చూపినట్లు తైక్వాండో మాస్టర్ అబ్దుల్ మజీద్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగిన సబ్ జూనియర్ కాడెట్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో క్రీడాకారులు మనీషా, పల్లవి, జోయా, మహమ్మద్ అంజాద్, ప్రణతేశ్వరరెడ్డి పాల్గొన్నారని తెలిపారు. వీరిలో సబ్ జూనియర్ అండర్-18 కేటగిరిలో మనీషా, అండర్-41 కేటగిరిలో షేక్ మహమ్మద్ అంజాద్ కాంస్య పథకాలు సాధించుకున్నారన్నారు. నంద్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు మారుతికుమార్ క్రీడాకారులను అభినందించారు.

సమ్మెను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 8న చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పేదరికం, పౌష్టికాహార లోపం, ఆకలి సమస్యను పూర్తిగా నిర్లక్ష్యం చేసి ఐసీడీఎస్‌ను నామమాత్రంగా నిధులు కేటాయిస్తుందన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు బాలవెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగరి శ్రీనివాసులు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు కోరా రు. మంగళవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. సమావేశంలో పుల్లయ్య, మునిస్వామి, రవి, వెంకటేశ్వ ర్లు, మద్దిలేటి,గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాశాలను సీజ్ చేయాలని జల దీక్ష

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నలంద కళాశాలను సీజ్ చేయాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కుందూనదిలో జలదీక్ష చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు ధనుంజయుడు, రఫీ, రియాజ్, నాగనవీన్, శివ, రాంబాబులు మాట్లాడుతూ విద్యార్థులకు ట్రిమ్మింగ్, చేయి విరగొట్టిన సంఘటనపై మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని కోరారు.

ఆర్ఏఆర్ఎస్‌లో ప్రపంచ మృత్తికా దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల (సెంట్రల్): మానవాళి మనుగడకు మృత్తిక సంరక్షణ ఎంతో అవసరమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఇన్‌చార్జ్ సహ సంచాలకురాలు జయలక్ష్మి తెలిపారు. మంగళవారం పరిశోధనా స్థానంలో ప్రపంచ మృత్తికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఏడీఆర్ మాట్లాడుతూ నేల, నీటి ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. భూ శాస్త్రవేత్త సతీష్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయంలో విచ్చలవిడి రసాయన ఎరువుల వాడకానికి అడ్డుకట్ట వేసుకోవాలి సూచించారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రభాకర్ వెంకట రమణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి కోత మిషన్ హెల్పర్ మృతి

శిరివెళ్ల: యర్రగుంట్ల- పేరూరు మధ్య సోమవారం వరి కోత మిషన్ బావిలో పడిన ఘటనలో జాడ కనిపించకుండాపోయిన హెల్పర్ వనికినిదిన్నెకు చెందిన కుమ్మరి రమణయ్య (51)మృతి చెందాడని ఎస్ఐ సురేష్ మంగళవారం తెలిపారు. బంధువులు రాత్రింతా శ్రమించి క్రేన్ల సహాయంతో మంగళవారం కోత మిషన్‌ను బయటకు తీశారు. మిషన్ మీద పడడంతో వ్యక్తి మృతి చెందాడని చెప్పారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య సుహాసిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

శ్వేత పత్రం విడుదల చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలోని స్వామిరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని, ఉపాధి ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఈనెల 23వ తేదీన ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మానవీయ విలువలను కాపాడుకుందాం

నంద్యాల(న్యూటౌన్): కనుమరుగవుతున్న మానవీయ విలువలను కాపాడుకుందామని ఏపీ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య అన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఇప్టా పాదయాత్ర కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక యుగంలో శాంతి, ప్రేమ, కరుణ, దయ లేకుండా పోతోందని, మనుషుల మధ్య దూరం పెరిగి మానవత్వం కనుమరుగైపోతుందన్నారు. వీటిని కాపాడేందుకు ఇప్టా జాతీయ స్థాయి నాయకత్వంలో పాదయాత్రలు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్ మాట్లాడుతూ డిసెంబర్ 18 నుండి గుంటూరులో పాదయాత్రలు ప్రారంభమై విజయవాడలో 22వ తేదీన బహిరంగ సభతో ముగుస్తాయన్నారు. సమావేశంలో ఏపీ ప్రజా నాట్య మండలి నంద్యాల జిల్లా కార్యదర్శి శివయ్య, కళాకారులు విజయ్, విష్ణు, కరీం, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి ప్రశంసా పత్రం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గంగన్నకు మంగళవారం మనం ఫౌండేషన్ వారు ప్రశంసా పత్రం అందించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. గంగన్న 1995 సంవత్సరం నుంచి వృద్ధులకు, అనాథ పిల్లలకు, సామాజికంగా వెనుకబడిన పిల్లలకు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఆయన సేవలను గుర్తించి వలంటీర్స్ దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరు మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి ప్రశంసా పత్రం అందజేశారని చెప్పారు. గంగన్నను కళాశాల సిబ్బంది అభినందించారు.

గ్రామ వనరులను సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(అర్బన్): గ్రామాల్లో సొంత వనరులను గుర్తించి పంచాయతీ అభివృద్ధికి వినియోగించుకోవాలని ఎంపీడీఓ సుగుణశ్రీ కోరారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం గ్రేడ్-1 నుంచి గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శుల విధులు, బాధ్యతలపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మహీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ మహబూబ్‌దౌలా అధ్వర్యంలో గ్రామ పంచాయతీ నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

కలవరపెడుతున్న 'మిచాంగ్'



ఉయ్యాలవాడ సమీపంలో వరి ధాన్యంపై పట్టలు కప్పిన రైతులు



ముత్యాలపాడులో నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ రంగ నేతాజీ

ఉయ్యాలవాడ : మిచాంగ్ తుఫాన్ అన్నదాతలను కలవరపెడుతోంది. కుందూతీర పరివాహక గ్రామాల్లో అధిక శాతం రైతులు వరి పంట నూర్పిడి చేస్తున్నారు. నూర్పిడి పూర్తయిన రైతులు వరి ధాన్యాన్ని రహదారులపై ఆరబోశారు. చిరుజల్లులు పడుతుండడంతో వాటిని కాపాడుకునేందుకు మంగళవారం పట్టలు కప్పారు. అయితే రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పుశనగ, మొక్కజొన్న, మినుము, తదితర పంటలకు ఈ వర్షం అనుకూలంగా ఉంటుంది.

దొర్నిపాడు: బంగాళాఖాతంలో ఎర్పడిన మిచాంగ్ తుపాను కారణంగా భారీ ఈదురు గాలులకు మండలంలో సాగుచేసిన జొన్న పంట నేలమట్టం అయ్యింది. అలాగే ఓ మోస్తరుగా కురిసిన జల్లులకు వరి, కంది, పత్తి పంటలను దెబ్బతీసిందన్నారు. అయితే శనగ పంటకు ప్రస్తుతం వర్షం ఎంతో అవసరం అని, కానీ ఆశించినంత వాన కురవలేదని రైతులు పేర్కొన్నారు.

చాగలమర్రి: మండలంలో తుపాన్ ప్రభావంతో కోత దశలో ఉన్న జొన్న, వరి, మిరప పంటలు నేలకొరిగి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. మండలంలోని ముత్యాలపాడు, నేలంపాడు గ్రామాలలో కోత దశలో ఉన్న సూమారు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వరి పంట దెబ్బతినింది. తుపాన్ ప్రభావిత గ్రామాల్లో నష్టపోయిన పంటలను మంగళవారం మండల వ్యవసాయాధికారి రంగనేతాజీ పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



విద్యా నగర్‌లో బడి ఈడు పిల్లలపై ఆరా తీస్తున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): బడిఈడు పిల్లలను తప్పనిసరిగా బడికి పంపాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని దేవనగర్-1, విద్యానగర్, సలీంనగర్ ప్రాంతాలలో ప్రత్యేక సర్వే నిర్వహించారు. పిల్లలు తప్పనిసరిగా బడికి వెళ్లేందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. 100శాతం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలో నంద్యాల జిల్లా ప్రథమ స్థానంలో ఉండడం హర్షణీయమన్నారు.

దొర్నిపాడు: బడి ఈడు పిల్లలను బడి పంపడం తల్లిదండ్రులు బాధ్యతగా తీసుకోవాలని తహసీల్దార్ జయప్రసాద్, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఎంఈఓ రామచంద్రయ్య సూచించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యలయ ఆవరణలో జీఈఆర్ సర్వేపై వలంటీర్లు, సచివాలయ వేల్ఫేర్ అసిసెంట్లకు అవగాహన కల్పించారు.

ఉయ్యాలవాడ : మండల పరిధిలోని ఉయ్యాలవాడ, పెద్దయమ్మనూరు, బోడెమ్మనూరు, ఆర్.జంబులదిన్నె గ్రామాల్లో జిల్లా సాంఘిక సంక్షేమాధికారిణి చింతామణి, ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డితో కలిసి బడిఈడు పిల్లలపై ఇంటింటా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

చాగలమర్రి: ఎంపీడీఓ మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో మంగళవారం వలంటీర్లకు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు, సచివాలయ సిబ్బందికి గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో సర్వేపై ఎంఈఓ న్యామతుల్లా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి కర్నూలు జిల్లాలకు చెందిన పాలిటెక్నిక్ కళాశాలల బాలబాలికల ఆటల పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో 11 పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఈఓ రాముడు, జేఎస్ డబ్ల్యూ సిమెంట్ మేనేజర్ లక్ష్మణస్వామి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రభాకర్

నంద్యాల(అర్బన్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని రాయమాల్పురం గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఎంపీపీతో పాటు ఎంపీడీఓ సుగుణశ్రీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. మండల శాఖల అభివృద్ధిపై ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్, విద్యా, పౌష్టికాహారం తదితర వాటిపై వీడియో డిస్‌ప్లే బోర్డు ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతమ్మ, ఈఓఆర్డీ మహీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు



చాబోలు గ్రామంలో వెలసిన లేఅవుట్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ, తదితరులు

నంద్యాల(అర్బన్): గ్రామాల్లో అనధికారిక లేఅవుట్లు వేస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీఓ రాంబాబు హెచ్చరించారు. అనుమతి లేఅవుట్‌లో స్థలాలను కొన్న వారికి బ్యాంకు రుణాలు రావని, ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. నంద్యాల మండలం చాబోలు గ్రామంలో వెలసిన అనధికారిక లేఅవుట్లను మంగళవారం కుడా ప్లానింగ్ సెక్రటరీ రవితో కలిసి పరిశీలించారు. అనంతరం డీఎల్‌పీఓ మాట్లాడుతూ కుడా నుంచి అనుమతులు తీసుకున్న తర్వాతనే వెంచర్లు వేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యతను ఇవ్వాలని, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.